

కోదాడ పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం

## సమన్వయంతో పనిచేసి గెలుపునకు కృషి చేయాలి

**బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్**

**అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ వివరించాలని సూచన**

కోదాడ, అక్టోబర్ 24 : పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ 29న జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేసేందుకు శ్రేణులను సమాయత్తం చేయాలన్నారు. కోదాడ మున్సిపాలిటీ పరిధిలో రూ.120 కోట్లతో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. అలాగే కేసీఆర్ బీమా, రూ.400 కే గ్యాస్, పెన్షన్ పెంపు తదితర అంశాలతో కూడిన పార్టీ మ్యానిఫెస్టోను ఇంటింటికీ తిరిగి తెలుపాలన్నారు. కార్యకర్తలు పార్టీని కాపాడితే పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రజా ప్రతినిధులు, వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## మల్లయ్య యాదవ్‌ను మెజారిటీతో గెలిపించాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సిరెడ్డి



వల్లపురంలో ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నడిగూడెం, అక్టోబర్ 24 : రానున్న ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ను తిరిగి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం వల్లపురం ఆంజనేయస్వామి దేవాలయంలో మల్లయ్యయాదవ్ గెలువాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమన్వయ కమిటీ సభ్యుడు దేవబత్తిని సురేశ్‌ప్రసాద్, నాయకులు అనంతుల ఆంజనేయులు, గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి, మారుతి ఉపేందర్, వట్టికూటి చంద్రయ్య, వెంకట్‌రెడ్డి, ఈదయ్య పాల్గొన్నారు.



నడిగూడెంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతీమధుబాబు

## సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- ఎంపీపీ జ్యోతీమధుబాబు

నడిగూడెం, అక్టోబర్ 24 : ఈ 29న కోదాడలో జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతీమధుబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో అన్ని గ్రామాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, మండల సమన్వయ కమిటీ నాయకులు దేవబత్తిని సురేశ్, ప్రసాద్, నాయకులు గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్, వెంకట నర్సయ్య, వీరస్వామి, శ్రీను, నారాయణరావు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

కోదాడ రూరల్, అక్టోబర్ 24 : పట్టణ పరిధి కోమరబండకు చెందిన ఎస్‌కె మజీద్ మృతిచెందాడు. తనతో పాటు చదువుకున్న 1997-98 బ్యాచ్ స్నేహితులు మంగళవారం రూ.21,500 ను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపేందర్, మామిడి రామారావు, దాసరి జయసూర్య, బత్తుల లింగరాజు, పసుపులేటి అంజిబాబు, కాలతిరిపి కృష్ణ, దేవపంగు ధనమూర్తి, గూడూరు చెన్నారాయుడు, ఎస్‌కె జాని, సంపేట ఉపేందర్, చక్రవర్తి, లక్ష్మయ్య, మద్దెల వెంకన్న పాల్గొన్నారు.

# ముమ్మరంగా తనిఖీలు

**ఇప్పటి వరకు 111 కేసులు నమోదు**

**రూ. 3.37 కోట్ల విలువైన నగదు, బంగారం, వెండి, వస్తువుల సీజ్**

**గ్రీవెన్స్ కమిటీ ద్వారా 69 కేసులు పరిష్కారం**

**రూ.1.55.87,455 బంగారం, నగదు, వస్తువులు విడుదల**

**గ్రీవెన్సు కమిటీ ద్వారా వేగంగా కేసుల పరిష్కారం**

సూర్యాపేట, అక్టోబర్ 24 : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక అధికారులు జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, సర్వేలెన్సు బృందాల ద్వారా నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు చేపట్టగా ఇప్పటి వరకు 111 కేసులు నమోదయ్యాయి. తనిఖీల్లో పట్టుబడిన నగదు, బంగారం, వెండి వస్తువులతో పాటు ఇతర సామగ్రి విలువ రూ.3,37,12,485 ఉన్నది. మంగళవారం నాటికి 69 కేసులు గ్రీవెన్స్ కమిటీలో పరిష్కరించగా వాటికి సంబంధించిన నగదు, బంగారం, ఇతర వస్తువులను విడుదల చేయడం జరిగింది. వాటి విలువ రూ.1,55,87,455గా ఉన్నది. మరో 3 కేసులకు సంబంధించి ఐటీ శాఖకు రిఫర్ చేశారు. ఆ కేసుల మొత్తం నగదు రూ.1,11,50,000గా ఉండనున్నది. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలో ఆధారాలు లేకుండా రూ.50 వేలకు పైగా నగదు తరలించిన, ఎలాంటి రశీదులు లేకుండా బంగారం, వెండి, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తరలించినా పోలీస్, ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వేలెన్సు బృందాలు వాటిని సీజ్ చేసి జిల్లా ఎన్నికల అధికారులకు అప్పగిస్తున్నారు. మంగళవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 111 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. 111 కేసుల్లో నగదు తరలింపు సందర్భంగా 99 కేసులు నమోదు కాగా బంగారం, వెండి తరలింపు సమయంలో 3 కేసులు నమోదయ్యాయి. మరో 9 కేసులు చీరెలు, గార్మెంట్స్, బ్లాంకెట్లు, ఫ్యాన్లు, గ్రైండర్లు, ఏసీ, ఫ్రీజ్, ఆట వస్తువులు ఉన్నాయి. 99 నగదు కేసుల్లో సుమారు రూ.1,71,42,180 సీజ్ చేయడం జరిగింది. బంగారం, వెండికి సంబంధించిన 3 కేసుల్లో రూ.1,02,00,000 విలువ ఉంటుంది. మిగతా 9 కేసుల్లో పట్టుబడిన వస్తువుల విలువ రూ.63,70,305గా ఉంటుందని అధికారులు తెలిపారు.

### గ్రీవెన్స్ కమిటీలో కేసుల పరిష్కారం..

కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీలో పట్టుబడిన వస్తువులు విడుదల చేయనున్నారు. సరైన ఆధారాలు చూపిస్తే వాటి విడుదలకు కమిటీ సిఫార్సు చేయడం జరుగుతున్నది. ఇప్పటివరకు 69 కేసులకు సంబంధించి రూ.1,55,87,455 విలువ గల నగదు, వస్తువులను విడుదల చేశారు. ఇందులో 63 కేసులు నగదుకు సంబంధించినవి ఉన్నాయి. ఆ నగదు విలువ రూ.89,72,300గా ఉన్నట్లు చెప్పారు. బంగారం, వెండికి సంబంధించి ఒక కేసు పరిష్కారం కాగా వాటి విలువ రూ.6 లక్షలు, మిగిలిన 5 ఇతర వస్తువులకు సంబంధించి రూ.60,15,155 నగదు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

### ఆధారాలు లేకుండా తరలించవద్దు : కలెక్టర్



ఎన్నికల కోడ్ ముగిసేవరకు ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, బంగారం, వెండి, ఇతర వస్తువులను తరలించవద్దు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 111 కేసులు నమోదయ్యాయి. వాటిలో 72 కేసులు అప్పీల్‌కు వచ్చాయి. 69 కేసులు పరిష్కరించి రూ.1,55,87,455 విడుదల చేశాం. 3 కేసులు ఐటీ శాఖకు రిఫర్ చేశారు. అత్యవసరంగా వైద్యం, కళాశాల ఫీజులు, వివాహ, వ్యాపార, ఇతర అవసరాలకు నగదు తరలించే సమయంలో సరైన పత్రాలు తీసువెళ్లాలి. వ్యాపారులు బిల్లులు, ఇన్‌వాయిస్, బ్యాంక్ లావాదేవీల వివరాల పత్రాలు, జీఎస్టీ కట్టిన వివరాలు వెంట తీసుకువెళ్లాలి.

### ఐటీ శాఖకు మూడు కేసులు సిఫార్సు..

రూ.10 లక్షలకు పైగా నగదు, వస్తువులు పట్టుబడితే వాటిని ఐటీ శాఖ ద్వారా విడుదల చేయాల్సి ఉంటుంది. దాంతో 3 కేసులకు సంబంధించిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోగా వాటిని ఐటీ శాఖకు పంపించారు. వాటిలో 2 బంగారం, వెండి సంబంధించిన కేసులు ఉండగా ఒకటి నగదు సంబందించిన కేసు ఉన్నది. వీటి విలువ రూ.1,11,50,000గా ఉన్నది. గ్రీవెన్స్ కమిటీకి 72 కేసులు దరఖాస్తు చేసుకోగా 69 పరిష్కారం చేసి 3 కేసులను ఐటీ శాఖకు రిఫర్ చేశారు.

### గ్రీవెన్స్ కమిటీకి ప్రత్యేక కార్యాలయం..

ఆధారాలు లేకుండా సీజ్ చేసిన నగదు, వస్తువుల విషయంలో అప్పీల్ చేసుకోవడానికి కలెక్టరేట్ కార్యాలయంలోని మొదటి అంతస్తు ఎఫ్ 12 రూమ్‌ను కేటాయించారు. ఇందులో గ్రీవెన్స్ కమిటీ ఫిర్యాదులను పరిష్కరించనున్నది. గ్రీవెన్సు కమిటీ చైర్మన్ జి. సురేశ్ ఫోన్ నంబర్ 837456622, కమిటీ సభ్యుడు రవికుమార్ 7799934305, గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ శ్రీధర్ 8100115651ను సంప్రదించాలని కోరారు.



మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

## వాణిజ్య ప్రగతికి రవాణా వ్యవస్థ దోహదం

**- కర్నల్ శ్రీనివాస్**

మునగాల, అక్టోబర్ 24 : వ్యాపార, వాణిజ్య అభివృద్ధికి రవాణా వ్యవస్థ ఎంతగానో ద్రోహద పడుతున్నదని విజయరాఘవపురం గ్రామ వాసి కర్నల్ సుంకరి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో డీసీఎం వాహనాల యజమానులు ఏర్పాటు చేసిన మునగాల మండల మినీ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు రవాణా ద్వారా సరుకు ఎగుమతి, దిగుమతి చేయడంలో మినీ లారీలు ఎంతో ప్రాధాన్యను పోషిస్తాయన్నారు. కావునా కమిటీ సభ్యులు, యజమానులు ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నర్ర శేషుబాబు, జోసెఫ్; బుల్లెట్ శ్రీను, రాంబాబు, నన్నే సాహేబ్, తోకల శ్రీను, ఐఎన్‌టీసీ నాయకులు, కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

కోదాడ రూరల్, అక్టోబర్ 24 : మండలంలోని కాపుగల్లులో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై రైడ్ చేసి మద్యం పట్టుకున్నట్లు రూరల్ పోలీసులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మహిళ నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో 14 క్వార్టర్లు, 2 బీర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

## మునుగోడును సీపీఐకి కేటాయించాలి

- లేదంటే స్నేహపూర్వక పోటీకి సై
- ఏకగ్రీవ తీర్మానం చేసిన సీపీఐ జిల్లా కౌన్సిల్




సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 23 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా నల్లగొండ జిల్లాలోని మునుగోడు నియోజకవర్గాన్ని సీపీఐకే కేటాయించాలని, లేదంటే కాంగ్రెస్‌తో స్నేహపూర్వక పోటీకి సిద్ధమని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు సీపీఐ నల్లగొండ జిల్లా కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసింది. సీపీఐ నల్లగొండ జిల్లా కార్యాలయంలో మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ముఖ్య అతిథిగా ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఇందులో ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు, పరిణామాలపై చర్చించారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పొత్తులో భాగంగా బలమైన పార్టీ క్యాడర్, గతంలో నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన సీపీఐకి మునుగోడును కేటాయించాలని జిల్లా కౌన్సిల్ సభ్యులు కోరారు. లేకుంటే తమకు స్నేహపూర్వక పోటీకి అనుమతించాలని కోరుతూ రాష్ట్ర, జాతీయ కౌన్సిళ్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసి పంపాలని నిర్ణయించారు. జిల్లా కౌన్సిల్ సభ్యుల్లో మెజార్టీ సభ్యులు జిల్లాలో బలమైన ఉద్యమ చరిత్ర ఉన్న మునుగోడు స్థానాన్ని సీపీఐకి కేటాయించాలని డిమాండ్ చేశారు. 2018లో చివరి క్షణంలో సీపీఐకి కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ సీటు తీసుకున్నదని గుర్తు చేశారు. మళ్లీ పొత్తుల పేరుతో మరోసారి మునుగోడులో సీపీఐకి తీవ్ర అన్యాయం చేయడం తగదన్నారు. గతంలో కాంగ్రెస్‌కు ఇచ్చారు.. కాబట్టి ఈసారి సీపీఐకి సీటు కేటాయించాలన్నారు. లేదంటే స్నేహపూర్వక పోటీకి సిద్ధమని జిల్లా నేతలు స్పష్టం చేశారు. అనంతరం పల్లా వెంకట్‌రెడ్డి రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను వివరించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్‌రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, ఇతర జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.